ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 124 బుధవారం 7-05-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 7 | వెల : 5 రూ/..

## పాక్‌పై ఆపరేషన్ సింధూర్

### 9 ఉగ్రస్థావరాలపై మెరుపు దాడులు

న్యూఢిల్లీ మే 6 : పహల్గాం దాడికి బదులు తీర్చుకుంటామని హెచ్చరించిన భారత్.. పాక్‌పై భీకర దాడుల ప్రారంభించింది. ఈ దాడిలో జీవిత భాగస్వాములను కోల్పోయిన మహిళల కన్నీరు తుడిచేలా ఆపరేషన్ సింధూర్ పేరిట పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు భీకర దాడులు ప్రారంభించాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌తో పాటు పాక్‌లోని మూడు పలు ఉగ్రవాద శిబిరాలను భారత మిస్సైల్ల వర్షం కురిపిస్తోంది. లష్కరే తయ్యబా, జైష్ ఏ మహ్మద్, హిజ్బులు ముజాహిద్దీన్, ఇతర ఉగ్రసంస్థల స్థావరాలు టెర్రర్ నెట్వర్క్‌లు ధ్వంసం చేయడమే లక్ష్యంగా బుధవారం తెల్లవారుజాము నుంచి మెరుపుదాడులకు దిగింది. బహావల్‌పూర్, మురిద్కే, కోట్లీ, గుల్‌పూర్, సవాయ్, సర్జాల్, బర్నాలా, మెహమూనా ప్రాంతాలపై దాడి దాడులకు దిగింది. బహావల్‌పూర్‌లో జైష్ ఏ మహ్మద్ హెడ్‌క్వార్టర్స్ ఉంది. మురిద్కే లో లష్కరే తయ్యబా శిక్షణ క్యాంపు ఉంది. కోట్లీలో సూసైడ్ బాంబర్ల శిక్షణ కార్యక్రమాలు సాగుతుంటాయి. గుల్‌పూర్‌లో నుంచి ఉగ్రవాదులు తరచూ పూంచ్, రాజౌరీలపై దాడులకు దిగుతుంటారు. సవాయ్, సర్జాల్, బర్నాలా, మెహమూనా వంటి ప్రాంతాలు ఉగ్రకార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నాయి. ఈ దాడుల్లో భారత త్రివిధ దళాలు పాల్గొన్నాయి. దీర్ఘశ్రేణి ఆయుధాలతో అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఈ దాడుల సమయంలో పాక్ పౌరులకు ఎలాంటి అపాయం లేకుండా జాగ్రత్తపడింది. పాక్ మిలిటరీ స్థావరాలపై కూడా దాడులు చేయలేదు. బుధవారం అర్ధరాత్రి 7.04 గంటలకు దాడులు ప్రారంభించింది. అంతకు కొద్ది గంటల ముందే ఆర్మీ నేవీ అన్నింటికి రెడీ అంటూ ట్వీట్ చేశాయి.




## మా నీళ్లు ఇక మాకే

### సింధు జలాలపై ప్రధాని మోదీ వ్యాఖ్య



**న్యూఢిల్లీ, మే 6:** ఇప్పటి వరకు ఇతరులకు ఇచ్చిన మన నీళ్లు ఇకపై మనకేనని ప్రధాని మోదీ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఏబీపీ మీడియా గ్రూప్ మంగళవారం నిర్వహించిన కాంక్లేవ్‌లో మాట్లాడుతూ.. ఈమేరకు వ్యాఖ్యానించారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న సింధు నది జలాల ఒప్పందాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే పొరుగు దేశం పేరు ఎత్తలేదు. "ఇక భారత జలాలు భారత్ కోసమే ప్రవహిస్తాయి... నిల్వ ఉంటాయి.. దేశ ప్రయోజనాలకే వినియోగమవుతాయి..." అని ప్రధాని మోదీ కాంక్లేవ్‌లో పేర్కొన్నారు. తద్వారా సింధు నది జలాల విషయంలో భారత్ అనుసరించనున్న వైఖరిని స్పష్టం చేశారు.

## కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కాను

### సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, మే 6:** ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాల కేసు లో నేడు సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువడిన విషయం తెలిసిందే. 14 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో ఐదుగురిని దోషులుగా.. ఇద్దరిని నిర్దోషులుగా కోర్ట్ ప్రకటించింది. ఓబులాపురం మైనింగ్ కంపెనీ, గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్, వీడీ రాజగోపాల్, అలీఖాన్‌లను దోషులుగా నిర్ధారిస్తూ.. వీరికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కృపానందంను నిర్దోషులుగా తేల్చింది.

# గాలికి ఏడేళ్ల జైలు

- ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాల్లో గాలి జనార్ధన్‌రెడ్డి దోషే
- 14 ఏళ్ల విచారణ తర్వాత సీబీఐ న్యాయస్థానం తీర్పు
- మరో ముగ్గురికి ఆయనతో పాటు ఏడేళ్ల కారాగారం
- నిర్దోషులుగా సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ కృపానందం
- తన ప్రజా సేవను గుర్తించి, తన వయస్సును పరిగణలోకి తీసుకొని శిక్షను తగ్గించాలని జడ్జిని అభ్యర్థించిన గాలి
- ఆరోపణలు రుజువయ్యాయి.. మీకు యావజ్జీవం ఎందుకు విధించవద్దు?.. అని ప్రశ్నించిన న్యాయమూర్తి
- తీర్పు వెలువడగానే చంచల్‌గూడకు గాలి తరలింపు



హైదరాబాద్, మే 6: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఓబుళాపురం ఇనుప ఖనిజం గనుల అక్రమ తవ్వకాల కేసులో మైనింగ్ మాఫియా డాన్, కర్ణాటక ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డిని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. ఏడేళ్ల కారాగార శిక్ష విధించింది. ఆయనతోపాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురికి కూడా ఏడేళ్ల కారాగార శిక్షను ఖరారు చేసింది. 14 ఏళ్ల సుదీర్ఘ విచారణానంతరం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి టి.రఘురామ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో అనంతపురం జిల్లా ఓబుళాపురంలో గాలి జనార్దన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ 2007-09 మధ్యకాలంలో యధేచ్ఛగా అక్రమ తవ్వకాలకు పాల్పడిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు పెట్టింది. ఐపీసీ 120బి (నేరపూరిత కుట్ర), 420 (మోసం), 409, 468, 471 (ఫోర్జరీ), అవినీతి నిరోధక యాక్ట్‌లోని సెక్షన్లు 13 (2), 13 (1)(డి) సెక్షన్ల కింద 2009లో కేసు నమోదైంది. కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య కేంద్రానికి లేఖ రాయడంతో సీబీఐ రంగంలోకి దిగింది. సరిహద్దులను కూడా మార్చేసి, నిబంధనలకు విరుద్ధంగా జరిపిన తవ్వకాల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అప్పట్లోనే రూ.884 కోట్ల నష్టం వాటిల్లినట్టు సీబీఐ తన దర్యాప్తులో తేల్చింది. మంగళవారం వెలువడిన తీర్పులో ఏ1 బి.వి.శ్రీనివాస్ రెడ్డి(గాలి బావమరిది), ఏ2 గాలి జనార్దన్‌రెడ్డి, ఏ3 అప్పటి గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, ఏ4 ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, ఏ7 మెహఫూజ్ అలీ ఖాన్ (గాలి వ్యక్తిగత సహాయకుడు)లను దోషులుగా నిర్ధారించి, నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. ఎనిమిదవ నిందితుడిగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కృపానందం, తొమ్మిదో నిందితురాలిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి గనుల మంత్రి, ప్రస్తుత తెలంగాణ ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. కేసు విచారణ సమయంలో ఏ5 ఆర్.లింగారెడ్డి మృతి చెందారు. ఏ6గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి వై.శ్రీలక్ష్మీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ ద్వారా 2022లో ఈ కేసు నుంచి విముక్తి పొందారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా 219 మంది సాక్షులను విచారించారు. 3,336 పత్రాలను సాక్ష్యంగా కోర్టుకు సమర్పించారు. జనార్దన్‌రెడ్డిని సీబీఐ 2011 సెప్టెంబరు 5న అరెస్టు చేసింది. దాదాపు మూడున్నరేళ్లు జైల్లో గడిపిన తర్వాత సుప్రీంకోర్టు బెయిలుతో బయటకు వచ్చారు. తీర్పు వెలువరించే క్రమంలో భాగంగా న్యాయస్థానం తొలుత కృపానందం, సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా ప్రకటించింది. ఆ వెంటనే సబిత కోర్టు హాల్ నుంచి బయటకు వచ్చిన కుమారుడు కార్తీక్‌రెడ్డిని ఆలింగనం చేసుకొని తనని నిర్దోషిగా ప్రకటించిన విషయం చెప్పారు. ఆ తర్వాత న్యాయస్థానం నిందితుల వరుస క్రమంలో పిలుస్తూ, దోషులుగా ప్రకటిస్తూ శిక్షను ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డికి శిక్ష విధించడానికి ముందు కోర్టుకు ఏమైన చెప్పాలనుకుంటున్నారా? అని జడ్జి ప్రశ్నించారు. తనకు శిక్ష తగ్గించాలని గాలి ప్రాధేయపడ్డారు. మాజీ మంత్రిగా, ఒక ప్రజాప్రతినిధిగా ప్రజలకు సుదీర్ఘ కాలంగా సేవ చేస్తున్నానని, స్వచ్ఛంద సంస్థల ద్వారా కూడా పలు సామాజిక సహాయ కార్యక్రమాలను చేస్తున్నందున శిక్ష తగ్గించాలని కోరారు.

## చేతకాకుంటే రాజీనామా చేయాలి


- కాంగ్రెస్.. దొంగ చేతికి తాళాలు ఇచ్చింది
- ఆ కారణంగానే ఎక్కడా అప్పు పుట్టడం లేదు
- మరోసారి కేసీఆర్‌ను విమర్శిస్తే నాలుక చీరేస్తాం: కేటీఆర్



**హైదరాబాద్, మే 6:** పరిపాలన చేతకా కుంటే సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. నోట్ల కట్లతో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని, అందుకే ఎక్కడా అప్పు పుట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ.. దొంగ చేతికి తాళాలిచ్చి ందని, ఆయన్ను సీఎం చేసి.. ఏఐసీసీ, రాహుల్‌గాంధీ తప్పుచేశారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'నన్ను కోసినా ఉన్న ఆదాయానికి మించి ఉద్యోగులకు పైసా ఇవ్వలేను' అని మాట్లాడడం.. సీఎం స్థాయి వ్యక్తికి తగదని, ఇంత అసమర్థ సీఎం దేశంలోనే ఎవరూ లేరన్నారు. బీఆర్ఎసను, వ్యక్తిగతంగా తమను తిట్టినా భరించామని.. తెలంగాణ ప్రతిష్ఠ దెబ్బతినేలా మాట్లాడితే సహించేది లేదన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు కేంద్రం కొత్త పథకం..

### రూ.1.5 లక్షల వరకూ ఉచిత వైద్యం..



**న్యూఢిల్లీ, మే 6 :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న కొత్త పథకం ఉపశమనం కలిగించనుంది. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకాన్ని ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ పథకం కింద బాధితుడు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఏదైనా గుర్తింపు పొందిన ఆసుపత్రిలో గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స పొందవచ్చు.

# తెలంగాణ విజయాలను ప్రపంచానికి చాటే అవకాశం

- మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ మనకు గర్వకారణం.. రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి ఊతం
- ఈ పోటీలు ప్రపంచ ఐక్యతకు వేదిక.. మన సంస్కృతి ఉట్టిపడేలా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దాలి
- అతిథులకు ఘన స్వాగతం పలకాలి: మంత్రి జూపల్లి.. నేడు 70 దేశాల సుందరీమణుల రాక



**హైదరాబాద్/సిటీ/శంషాబాద్ రూరల్, మే 6:** ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణలో నిర్వహించడం మనకు గర్వకారణమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తెలంగాణ సాంస్కృతిక మూలాలు, మనం సాధించిన విజయాలను ప్రపంచానికి చాటిచెప్పే అవకాశాన్ని ఈ పోటీలు కల్పిస్తాయని అన్నారు. ఈ పోటీల కోసం ప్రపంచ స్థాయిలో ఏర్పాట్లు చేశామని జూపల్లి తెలిపారు. తెలంగాణలో తొలిసారిగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లు, ఇతర అంశాలను వివరించేందుకు మంగళవారమిక్కడ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో మంత్రి జూపల్లితో పాటు పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, నటుడు సోనూసూద్, మిస్ ఇండియా నందినీ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రపంచ సుందరి పోటీలకు ఎవరైనా హాజరు కావచ్చని చెప్పారు. పోటీలకు వచ్చే ప్రతినిధులందరూ ప్రపంచ శ్రేణి అనుభవాలను పొందుతారని ధీమా వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ అనేది కేవలం అందాన్ని, ప్రతిభను చాటుకొనే పోటీ మాత్రమే కాదని.. ఇది సాధికారత, వైవిధ్యం, ప్రపంచ ఐక్యతకు వేదిక అని పేర్కొన్నారు. ఈ పోటీల వల్ల తెలంగాణ గురించి యావత్ ప్రపంచం తెలుసుకుంటుందని, రాష్ట్ర పర్యాటకాన్ని ప్రపంచానికి చూపటానికి ఇదో మంచి అవకాశమని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ కోసం దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలూ పోటీపడ్డాయని, సీఎం రేవంత్ చొరవతో ఈ పోటీల నిర్వహణ అవకాశం రాష్ట్రానికి దక్కిందని తెలిపారు. ఈ పోటీల ద్వారా రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ పోటీలు మన మహిళలకు స్ఫూర్తి కలిగిస్తాయని జూపల్లి చెప్పారు. ప్రతి దేశం తమ ప్రతినిధిని పంపడం మాత్రమే కాదు, తెలంగాణను దగ్గరగా చూస్తుందని మిస్ వరల్డ్ సీఈవో జూలియా తెలిపారు. ప్రతి ఒక్కరికీ పర్యాటకం కావాల్సిందేనని, ప్రపంచంలో పర్యాటక రంగానికి ఎంతో ప్రాధాన్యం ఉందని చెప్పారు. తమకు సాదరంగా ఆహ్వానించారని.. తెలంగాణకు అత్యుత్తమమైంది కావాలని, అది తాము ఇస్తామని అన్నారు. ఈ పోటీలకు 120కి పైగా దేశాల నుంచి అందగత్తెలు రానున్నారన్నారు. ఈ పోటీల ద్వారా భారతదేశం నుంచి ప్రపంచం నేర్చుకునే అవకాశం కలుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం మిస్ వరల్డ్ పోటీలకు ఒక నేపథ్యం ఉంటుందని.. ఈ సారి పర్యాటకంపై దృష్టి సారించామని జూలియా వివరించారు. సినీ నటుడు సోనూసూద్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజలు తనను ఎంతగానో ఆదరించారని, వారి ప్రేమ అపూర్వమని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీలు చూస్తూ ఎదిగిన తాను.. ఈ రోజు ఆ పోటీల నిర్వాహకులతో కలిసి వేదిక పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. తాను రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తన జీవితంలో అత్యంత అందమైన మహిళ తన భార్యేనన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తుండడం ఆనందంగా ఉన్నప్పటికీ ఒత్తిడి కూడా అధికంగానే ఉందని చెప్పారు.

### మన సంస్కృతి ప్రతిబింబించాలి: జూపల్లి

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు విమానాశ్రయ అధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఆహ్వానం పలకాలని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఏర్పాట్లను పరిశీలించారు. అతి??థులకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని జీఎంఆర్, పర్యాటక శాఖ అధికారులకు స్పష్టం చేశారు. విమానాశ్రయాన్ని పూలు, మామిడి, అరటి తోరణాలతో అలంకరించాలని చెప్పారు. ఇమిగ్రేషన్, కస్టమ్స్ క్లియరెన్స్ త్వరగా పూర్తి చేయాలని సీఐఎసఎఫ్ అధికారులకు సూచించారు. అడుగడుగునా తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా చూడాలని తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మె వాయిదా..

### మంత్రి పొన్నం చర్చలు సఫలం..



**హైద్రాబాద్, మే 6 :** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె వాయిదా పడింది. రేపటి నుంచి సమ్మె చేయాలని నిశ్చయించుకున్న ఆర్టీసీ జేఏసీ నాయకులతో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. జేఏసీ నేతల డిమాండ్లను సమ్మతి తెలపడంతో ప్రస్తుతానికి సమ్మె విరమించుకు న్నట్లు వారు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్, నవీన్ మిత్తల్ ఉంటారు. కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చించి వారంలోగా పరిష్కారం చూపాలని సర్కార్ ఆదేశాలిచ్చింది. తమ డిమాండ్లను తీర్చకపోతే ఈ నెల మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో వెంటనే ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులకు బహిరంగ లేఖ రాసింది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా పుంజుకుంటున్న ఆర్టీసీని సమ్మె ద్వారా దెబ్బతీయవద్దని కోరింది. అలా కాకుండా మొండిగా సమ్మెకు దిగితే మాత్రం కఠిన చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. ఎస్మా చట్టం ప్రకారం ఆర్టీసీలో సమ్మెలు చేయడం నిషేధం. ఇదిలా ఉంటే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. తమ డిమాండ్లకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఉద్యోగ సంఘాలు సమ్మెను వాయిదా వేసుకున్నాయి. ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె వాయిదా వేస్తున్నట్లు సచివాలయం మీడియా పాయింట్ వద్ద వెల్లడించారు. ప్రభుత్వంతో సుదీర్ఘంగా జరిపిన చర్చలు సఫలమయ్యామని ప్రకటించారు. పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావులతో అనేక అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ యూనియన్ లపై ఆంక్షల తొలగింపు, అన్ని కేటగిరీల్లో ఖాళీ భర్తీ, గుర్తింపు ఎన్నికల నిర్వహణ, కారుణ్య నియామకాలు , ఉద్యోగ భద్రతపై సర్క్యులర్, నేరుగా ఆర్టీసీకే ఎలక్ట్రిక్ బస్సులు, 2025 నుంచి రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లింపులు, 2017లో రిటైర్ అయిన వారికి వేతన సవరణ ప్రకారం బెనిఫిట్స్ వంటి డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే 2019 లో సమ్మె కాలంలో ఉద్యోగులపై వేసిన పోలీస్ కేసులను మాఫీ, ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం చేయాలని కోరినట్లు వెల్లడించారు. తమ అని డిమాండ్లను విడతల వారీగా పరిష్కరిస్తామని సర్కార్ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

